భీమారం ఎస్ఐగా బీ రాములు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రాములు

భీమారం, ఫిబ్రవరి 18 : భీమారం నూతన ఎస్ఐగా బీ. రాములు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రాజావర్ధన్ మంచిర్యాల పోలీస్‌స్టేషన్ బదిలీ కాగా, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ నుంచి రాములు బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

కన్నెపల్లి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రావణ్‌కుమార్

కన్నెపల్లి, ఫిబ్రవరి 18 : కన్నెపల్లి మండల తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా, హుజూరాబాద్ నుంచి శ్రావణ్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును కలిసిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 : జైపూర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు ఆదివారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం శ్రీరాంపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

బెల్లం ఛాయ్‌కి భలే గిరాకీ..

- మంచిర్యాల పట్టణంలో బెల్లం 'టీ' కి విశేష ఆదరణ
- తాగేందుకు ఎగబడుతున్న ఛాయ్ ప్రియులు

టీకోసం వేచి చూస్తున్న ఛాయ్‌ప్రియులు

ఛాయ్‌తాగుతున్న పట్టణ వాసులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 18: రోజూ ఉదయం ఛాయ్‌తోనే దినచర్యలను ప్రారంభించేవారు ఎందరో ఉన్నారు. టీ తాగనిదే ఏ పని ప్రారంభించని వారు మరికొందరు ఉంటారు. ఇంట్లో మొదలుకుని స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు ఎవరు కలిసినా ముందు టీ తాగుదాం అంటుంటారు. ఛాయ్‌కు ఉన్న క్రేజ్‌ను ఎన్నో హోటళ్లు సొమ్ము చేసుకుంటున్నాయి. మంచి రుచి, సువాసన, చిక్కదనం ఉన్న ఛాయ్ ఎక్కడ దొరుకుతుందో తెలుసుకుని మరీ అక్కడికి వెళ్లి తాగుతారు ఛాయ్ ప్రియులు. అలాంటి ఛాయ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మంచిర్యాలలోని ఓవర్ బ్రిడ్జి ఏరియా మారింది. రెండు నెలల కిందట ఇక్కడ పాండ్యావర్చా ఛాయ్ పేరుతో టీస్టాల్‌ను ఏర్పాటు చేశారు. బెల్లం టీ అతి తక్కువ కాలంలోనే ఆదరణ పొందింది. పట్టణంలోని నలుమూలల నుంచి ఛాయ్ ప్రియులు ఇక్కడికి వచ్చి టీ తాగుతున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆవు పాలు ప్రత్యేక వాహనంలో ఇక్కడకు తీసుకువస్తున్నారు. ఆ పాలతోనే బెల్లంటీ, బెల్లంపాలు, బెల్లం కాఫీ, జింజర్ టీ, ఇలాచి టీ వంటివి తయారు చేస్తున్నారు. సింగిల్ బెల్లం టీ ధర రూ. 10 కాగా స్పెషల్ బెల్లంటీ ధర రూ. 20, బెల్లం కాఫీ ధర రూ. 25 వరకు తీసుకుంటున్నారు. రోజుకీ 1500 పైగా ఛాయ్‌లు అమ్ముతున్నారు.

రోజుకు 1500 ఛాయ్‌లు అమ్ముతున్నాం..

తయారు చేస్తున్న బెల్లం టీకి పెద్ద ఎత్తున ఆదరణ లభించడం చాలా ఆనందంగా ఉంది. నాగపూర్ నుంచి వచ్చే ఆవుపాలనే తాము చాయ్ తయారీకి వాడుతాము. ప్రత్యేకమైన టీ పౌడర్‌ను వాడుతాం. చక్కెర వేయకుండా బెల్లాన్ని తియ్యదనం కోసం వాడుతాం. రోజుకి 1500 ఛాయ్‌లు అమ్ముతున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు గిరాకీ ఉంటుంది. ఒక్కోసారి పాలు అయిపోతున్నాయి. అలాంటి సందర్భంలో టీస్టాల్ మూసేయాల్సి వస్తుంది. అంతే తప్పా ఇక్కడ దొరికే పాలను వాడడం లేదు.

- మోహన్ ఆబారే, పాండ్యావర్చా ఛాయ్ హోటల్ నిర్వాహకుడు

ఉత్సాహంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం వార్షికోత్సవం, స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ శోభ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పడాల రవీందర్‌కు ఉత్తమ సేవా అవార్డు

ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న పడాల రవీందర్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 : మంచిర్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడిగా ఉత్తమ మోటివేటర్‌గా, అత్యధిక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించినందుకుగాను గవర్నర్ ద్వారా వచ్చిన సేవా అవార్డును పడాల రవీందర్‌కు కలెక్టర్ బదావత్ సంతోష్ అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ తన సేవలు గుర్తించి అవార్డు అందించిన కలెక్టర్ బదావత్ సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని, మరిన్ని సేవలందిస్తానని రవీందర్ పేర్కొన్నారు.

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను వసూలుకు మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా ఇంటింటా తిరుగుతూ ఇంటి పన్ను వసూలు చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది పెండింగ్ బిల్లులను వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

- విద్యా రంగానికి నిధులు పెంచాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 18 : విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరికాదని, బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలని ఇచ్చిన హామీని నిలిబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో బడ్జెట్‌లో 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ 11.3 శాతమే కేటాయించిందన్నారు. విద్యారంగం బాగుపడాలంటే 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాహుల్, రాజ్ కుమార్, సిద్ధార్థ, కార్తిక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

పుస్తక పరిచయ కవిని సన్మానిస్తున్న కవులు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 18: మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం కవుల గానాలతో అలరించింది. మత్యబోయిన మలయశ్రీ రచించిన తెలంగాణ గెలుపు పుస్తకాన్ని కవి రాగా వధాని పొనకంటి దక్షణ మూర్తి పుస్తక పరిచయం చేశారు. సంస్థ అధ్యక్షుడు దండనాయకులు వామన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా బెల్లంకొండ మల్లారెడ్డి, డాక్టర్ దాసరినాథ్ గౌడ్, భూపతి సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పుస్తక పరిచయ కర్తను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బెల్లాల సుగుణాకర్, మహిళా కార్యదర్శి ఉత్తూరి శ్రీలక్ష్మి, కవుటూరి ప్రసాద్, పెంచాల శ్రీనివాస్, రామస్వామి, దుర్గం రాజేశం గౌడ్, వైకుంఠం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

దండేపల్లి, ఫిబ్రవరి18: దండేపల్లి మండలంలోని కాసిపేటకు చెందిన బైరి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మానవతా దృక్పథంతో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రూ.5వేల ఆర్థిక సహాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందించి ఔదార్యం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేశ్, కల్లెం రాజన్న, లక్కాకుల వెంకటేశ్, మదాసు వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి డ్రామా పోటీలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19 న నిర్వహించనున్న ఆంగ్లభాషా నైపుణ్యం అంశంలో ఉమ్మడి జిల్లా స్థాయి డ్రామా పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. నిర్మల్‌లో అర్బన్ కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. విజేతలను ఈ నెల 26న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని కిష్టంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమనపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం వేమనపల్లి మండలంలోని రాజా రం గ్రామానికి చెందిన నాయిని గోవర్ధన్, సుమన్ ఇద్దరు యువకులు మంచిర్యాలకు ద్విచక్రవాహనంపై వెళ్తూ కిష్టంపేట సమీపంలో చెన్నూర్ వైపు వస్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టారు. యువకులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : బీఎస్పీ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 : నస్పూర్ మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీపై వెళ్లి కమిషనర్ రమేశ్ ఇచ్చిన ఇంటి నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జి కాదాసి రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్‌లో విలేకరులతో మా ట్లాడారు. బదిలీపై వెళ్లిన అధికారి ఇంటి నిర్మాణం అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనుమతులు రద్దు చేయాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న మున్సిపల్ అధికారులకు సన్మానం

అధికారులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, ఉద్యోగులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 18: క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన జీ వెంకటనారాయణ, మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన కీర్తి నాగరాజు బదిలీపై వెళ్లగా వారికి శనివారం రాత్రి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని కౌన్సిలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. వెంకటనారాయణ నిజామాబాద్ జిల్లాలోని బోధన్ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లగా మేనేజర్ కీర్తి నాగరాజు ఉద్యోగోన్నతిపై కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీని మంచిర్యాల జిల్లాలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, అలుగుల శ్రీలత సత్తయ్య, అనిల్‌రావు, పోగుల మల్ల య్య, ప్రస్తుత కమిషనర్ మురళీకృష్ణ, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్, ఏఈ అచ్యుత్, టౌన్ ప్లానింగ్ అధికారి రాజ్‌కుమార్, సాదిక్‌అలీ, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

మున్సిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ

మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మున్సిపాలిటీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఎన్. మురళీకృష్ణ ఉద్యోగోన్నతిపై క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో అరుణ్-11 జట్టు విజయం



బహుమతులను అందజేస్తున్న కౌన్సిలర్ మహేశ్

చెన్నూర్, ఫిబ్రవరి 18: చెన్నూర్ నిర్వహించిన అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. అరుణ్-11, విక్కీ-11జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. తుది పోరులో అరుణ్-11 జట్టు విన్నర్‌గా, విక్కీ-11 జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ 5,000నగదు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ 2,000నగదుతో పాటు షీల్డ్‌లను కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, గాడిపెల్లి సంతోష్, తలారి మురళి, రాదండి నవీన్, కటుకు శ్యాం, నిర్వాహకులు తిరుపతి సురేశ్, గుడిమల్ల రమేశ్ పాల్గొన్నారు.

'ఎత్తు బంగారం' మొక్కులు..

చిన్నారికి ఎత్తు బంగారం తూకం వేస్తున్న భక్తులు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 17: సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో 'ఎత్తు బంగారం' (బెల్లం) మొక్కులను సమర్పించేందుకు వచ్చిన భక్తులతో ఆదివారం కిరాణా షాపుల వద్ద సందడి నెలకొన్నది. జిల్లా కేంద్రంలోని మార్కెట్లో దుకాణాల ముందు చిన్నారులను తూకంలో కూర్చుండబెట్టి తులాభారం వేస్తున్న దృశ్యాలు కనిపించాయి. కొందరు భక్తులు మేడారం వెళ్లారు. మరి కొందరు భక్తులు మంచిర్యాల పట్టణంలోని గోదావరి వద్ద గల అమ్మవార్ల గద్దెల వద్ద ఎత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

సంత్ సేవాలాల్ జెండా గద్దె వద్ద పూజలు చేస్తున్న బంజారాలు

జన్నారం, ఫిబ్రవరి 18 : సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని జువ్విగూడలో జగదాంబ ఆలయంలో సంత్ సేవాలాల్ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రధాన రోడ్డు మీదుగా అంగడిబజార్ చౌరస్తాలో గల సంత్ సేవాలాల్ జెండా గద్దె వద్దకు సంకీర్తనలు ఆలపిస్తూ ర్యాలీగా వెళ్లి జెండాకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం అధ్యక్షుడు నందునాయక్, బానావత్ రాములునాయక్, జాదవ్ సందేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు, మున్వర్ అలీఖాన్, రాంకిషన్ నాయక్, కిషన్ నాయక్, ముత్యం రాజన్న, సేవాలాల్ భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

- డైరెక్టర్ (ఆపరేషన్ అండ్ పా) ఎన్‌వీకే.శ్రీనివాస్

కేకేఓసీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ వీకే.శ్రీనివాస్

మందమర్రి, ఫిబ్రవరి 18: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ అండ్ ప్లానింగ్ ఎన్‌వీకే.శ్రీనివాస్ సూచించారు. సింగరేణి మందమర్రి పట్టణంలో సింగరేణి యాజమాన్యం, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులను ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి పరిశీలించారు. ఏరియాలోని కేకే ఓసీ ప్రాజెక్టును సందర్శించి మ్యాపులను పరిశీలించారు. కేకే ఓసీ పునరావాస కేంద్రమైన పెద్దనపల్లి శివారులో పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధనకు నిబద్ధతతో కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఓస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, సిమ్టార్స్ ఎస్వోఎం విజయ్ కుమార్, కేకే ఓసీ పీవో రమేశ్, సివిల్ డీజీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా క్రికెట్ పోటీలకు సింగరేణి జట్టు ఎంపిక

- నేటి నుంచి 24 వరకు జార్ఖండ్‌లో కోలిండియా స్థాయి క్రికెట్ పోటీలు

క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న కోచ్ చాట్ల అశోక్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 : కోలిండియా స్థాయి క్రికెట్ పోటీలకు జట్టును సింగరేణి క్రీడా విభాగం ఎంపిక చేసింది. ఈ నెల 19 నుంచి 24 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని (ఈసీఎల్) బొగ్గు పరిశ్రమ హెడ్‌క్వార్టర్ శాంక్టోరియాలో కోలిండియా క్రికెట్ పోటీలు జరగనున్నాయి. సింగరేణి జట్టులో 16 మందిలో శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఐదుగురు కార్మిక క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రికెట్ టీంకు శ్రీరాంపూర్ ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ కోచ్‌గా వ్యవహరించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించారు. వారం రోజులుగా భూపాలపల్లిలో కోచింగ్ క్యాంపు నిర్వహించారు. కోలిండియా క్రికెట్ పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే.. జట్టుకు క్యాప్టెన్‌గా వీ సంపత్‌కుమార్ (ఏఎల్‌పీ), వైస్ క్యాప్టెన్‌గా బీ శశికాంత్ (శ్రీరాంపూర్), కే నాగ మోహన్ (కొత్తగూడెం), కే ప్రశాంత్ (శ్రీరాంపూర్), కే రాకేశ్ (మందమర్రి), కట్ట లక్ష్మణ్ (కార్పొరేట్), కే రాజేందర్ (మందమర్రి), సీహెచ్ విశ్వనాథ్ (ఆర్జీ-2), కే సాయిరాకేశ్ (కొత్తగూడెం), జీ యుగేంధర్ (మణుగూరు), సాయిధీరజ్ (కొత్తగూడెం), జీ వెంకటేశ్వర్లు (శ్రీరాంపూర్), బీ తులసీరాం (శ్రీరాంపూర్), సీహెచ్ శ్రావణ్‌కుమార్ (భూపాలపల్లి), ఎస్‌కే జాజా మొయినొద్దీన్ (కార్పొరేట్), ఐ చిరంజీవి (శ్రీరాంపూర్), ఎండీ తాజొద్దీన్ (భూపాలపల్లి) ఏరియా నుంచి ఎంపికయ్యారు.

చేతబడి, క్షుద్రపూజలను నమ్మవద్దు

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్సలొద్దీన్

నెన్నెల,ఫిబ్రవరి18: మూఢ నమ్మకాలను విశ్వసించి జీవితాలను నాశనం చేసుకోవద్దని బెల్లంపల్లి రూరల్ సీఐ అప్సలొద్దీన్ ప్రజలకు సూచించారు. ఆదివారం నెన్నెల మండలంలోని జంగాల్‌పేటలో మంత్రాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇద్దరు ఒకరిపై ఒకరు మంత్రాలు చేస్తున్నారని ఫిర్యాదులు చేసుకున్నారని తెలిపారు. మంత్రాలు, చేతబడులు, క్షుద్ర పూజలు అనే వాటిని నమ్మవద్దన్నారు. అనారోగ్యానికి గురైన వారు సంబంధిత డాక్టర్‌ను సంప్రదిస్తే ఆరోగ్యం కుదుట పడుతుందన్నారు. బాబాలు, శివసత్తుల వద్దకు వెళ్తే ఆరోగ్యాన్ని బాగు చేస్తారా ? అని ప్రశ్నించారు. ఎవరినైనా మంత్రాలు చేస్తున్నారని దూషించడం, ఇండ్లపై దాడి చేయడం గాని చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ శ్యాంపటేల్, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఆది జాంబవ సంఘం సన్మానం

మందమర్రి, ఫిబ్రవరి 18: మందమర్రి పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రాజశేఖర్‌ను ఆది జాంబవ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఆది జాంబవ సంఘం నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ సంఘం గౌరవ అధ్యక్షుడు కంబాల రాజనర్సు, అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీదునూరి శంకర్, కార్యదర్శి అవునూరి పోషం, ప్రచార కార్యదర్శులు దాసరి రాజనర్సు, రేగుంట రాజన్న, ఉపాధ్యక్షుడు కలువల శ్రీనివాస్, కోశాధికారి వెంకన్న, గసికంటి మల్లయ్య, గాలిపెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

పట్టుకున్న మద్యంతో పోలీసులు

కన్నెపల్లి,ఫిబ్రవరి 18 : కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపారు. పోచమ్మ ఆలయం వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారం మేరకు నిఘా పెట్టారు. ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం కాటన్‌లు లభించాయి. పట్టుకున్న మద్యం విలువ రూ.1,27,560 లక్షలు ఉంటుందని తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి రాపెల్లి అనిల్ కుమార్, నాగపురి రమేశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.